కథా నిలయం
3950
శ్రీకాకుళం



క్రూరమృగం మీద పడితే మందంతా చెదిరిపోగా దూడను కాపాడు కునేందుకు కొమ్ములిసిరి కాపు కాచింది ఓ గంగిగోవు. క్రూరమృగాల కన్నా హీనంగా స్వజనమే పీక్కుతినడం మొదలుపెడితే కన్న కొడుకును కాపాడుకునేందుకు ఓ విధవరాలు ఏం చేయాలి?

## పొడిచే ఆవు

గునుపూడిలో ఏ కొద్దిమంది ఉపాధ్యాయులకో తప్ప ఊరందరికీ వ్యవసాయమే వృత్తి. వ్యవసాయం అనగానే తోట, దొడ్డి, పశువులు ఉండనే ఉంటాయి. అలా వ్యవసాయం చేసి జీవించేవాళ్ళలో మాది ఓ విధంగా సంపన్న కుటుంబం అనే చెప్పుకోవాలి. భూమి పుత్రాతోబాటు, ఇంటి ఖర్చులకి సరిపడ్డ పాలిచ్చే పాడి పశువులూ ఉన్నాయి. వీటన్నింటిలోనూ పెద్దది మా అమ్మగారు కాపురానికి వస్తూ అరణంగా తీసుకొచ్చిన పెద్ద కొమ్ముల ఆవు. నిజానికి మిగిలిన మా ఆవులూ, దూడలూ దాని సంతానమే! అద్ది పెయ్య దూడని పెట్టినప్పుడు దానితో బాటు దాని కూతురు కూడా ఓ దూడని కన్నది ఓ నెల తేడాగా. అంటే, తల్లీ కూతుళ్ళిద్దరూ కొడుకుల్ని కన్నారు! వారిద్దరూ వరసకి అల్లుడు మామలౌతారు కదా! అలా అల్లుడు మామలు జతకట్టి దున్నిన వ్యవసాయంలో అడిగినంత పంట పండుతుందని చెప్పుకునే వారు అప్పుడు. అంతా బాగానే ఉంది కానీ, ఒక్కటే చిక్కొచ్చిపడింది. ఆ పెద్దావుకి కొమ్ములకంటే కోపం స్థాయి ఎక్కువ. ఎప్పుడూ బుస్సు బుస్సు మంటూ ఉండేది. ఒక్క మా అమ్మగారికి తప్ప ఎవ్వరికీ లొంగేది కాదు. అది పుట్టింటి మీది అభిమానం అయివుండొచ్చు. ఏదైతేనేం మా యింటి ఆవుల మందలో ఆ ఆవుకి 'పొడిచే ఆవు' అన్న పేరు స్థిరపడిపోయింది.

'ఆవు సాధు జంతువు' అని మనం చిన్నప్పుడు పాఠాల్లో చదువుకుంటాం! అంటే స్త్రీ బాల వృద్ధులు సైతం దాని గంగడోలు క్రిందుగా నిర్భయంగా దూరిపోవచ్చునని చెప్పుకోవడం నాకు సుతరామూ నచ్చేది కాదు. నచ్చినా, నచ్చకపోయినా నిజం నిజమే కదా!

అప్పుడప్పుడూ నాకో ధర్మసందేహం వస్తుండేది. మా పొడిచే ఆవు అంత చెడ్డదయితే దాన్ని అమ్మిపారేయొచ్చు కదా! అనుక్షణం దానికి భయపడుతూ, దాన్ని ఇంట్లోనే కట్టేసుకోడం ఎందుకు? అని. ఆ విషయం మాత్రం మావాళ్లు ఒప్పుకోరు. ఎందుకంటే, ఎంత చెడ్డా అది

ఆవు. అనేకవిధాల పనికొచ్చే వస్తువు. ఇంటికి సరిపడ్డన్ని పాలిస్తుంది. ఎన్నో పెయ్యల్ని పెట్టింది. వాటికి మళ్ళీ పెయ్యలూ, దూడలూ పుట్టాయి. అలా దాని వంశం తామర తంపరగా పెరిగి పెద్దవడం మాకు ఆర్థికంగా ఎంతో లాభదాయకం. అలాంటి ఆవుని చూస్తూ చూస్తూ ఎలా అమ్మేస్తాం? నిజమే! మనిషి ఎప్పుడూ స్వార్థపరత్వంతోనే ఆలోచిస్తాడు. ఆ ఆలోచనలనే అమలుపరుస్తాడు. కానీ బైటి ప్రపంచానికి మాత్రం 'నేనిదంతా మీ కోసమే చేస్తున్నాను. ఇందులో నాకేమీ ఒలికేది లేదు' అని నమ్మించ చూస్తాడు. అందుకోసం భగవంతుడిచ్చిన తెలివినంతా ధారపోస్తాడు.

స్వతహాగా సాధువుగా ఉండవలసిన ఆవు అసలు పొడిచేదిగా ఎందుకు తయారైంది? లేక ముందునుంచీ దాని నైజం అంతేనా? మధ్యలో మారిందా? ఇలాంటి ప్రశ్నలు కూడా నన్ను పట్టుకు వేధిస్తూండేవి. వీటికి సమాధానాలు పుస్తకాల్లో వెదికితే దొరకవు. ఎవరైనా అనుభవజ్ఞుల్ని అడిగి తెలుసుకోవాలి. అదీ మా ఆవుని చిన్నప్పట్నుంచీ ఎరుగున్నవారు చెప్పాలి. అప్పుడుగాని ఇందులోని అంతరార్థం బోధపడదు. అటువంటి వారిలో మా అమ్మగారు ముఖ్యులు. కనుక ఆమెనే అడిగాను యీ అంతర్మథనానికి తరణోపాయం చెప్పమని. అప్పుడామె ఇలా చెప్పింది :-

నువ్వన్నట్టుగా ఈ ఆవు నైజం పుట్టినదగ్గర్నుంచీ ఇలా ఉండేది కాదు. మొదట్లో ఇది ఎంతో సాధువుగా ఉండేది. నాతో బాటు దాన్ని కూడా మా పుట్టింటివారు గునుపూడి తోలిపెట్టినప్పుడు బుద్ధిగా నాతో వచ్చేసింది. పుట్టింటి మీద మనసు మళ్ళినపుడు, అప్పుడప్పుడూ నేనైతే వెళ్లి మావాళ్లని చూసి తిరిగి వస్తుండేదాన్ని. కానీ నోరు లేని ఆ జీవాన్ని పట్టించుకునేదెవరు? దీని మనసులోని వేదన ఎవరికి కావాలి? అందుచేత అది స్థిరోభవ, వరదోభవ అని ఇక్కడే ఉండిపోయింది. మీరంతా అదిచ్చిన గుమ్మపాలు త్రాగీ బలం పుంజుకుని ఇంతటివాళ్లయ్యారు. ఎంతో శాంతంగా ఉండే ఈ ఆవు పొడిచేదిగా మారిపోవడానికి నేపథ్యంలో చాలా కథ ఉంది. ఇది క్రొత్తగా ఆవు మనింటికి వచ్చిన రోజుల్లో జరిగిన సంఘటన. అందువల్ల మీకంతగా తెలియదు.

మన ఊరికి పడమరగా ఉన్న పెనుగొండ తెలుసుకదా! వేసంగిలో, పల్లపు ప్రాంతాలన్నీ నీటి సదుపాయం లేక ఎండిపోయాయి. అందువల్ల ఆవుల్ని కాసే పాలికాపులు వాటిని 'ఎగుదల' కొండ ప్రాంతాలకి తోలుకుపోతారు. అక్కడ దట్టంగా పెరిగిన చెట్ల నీడల్లో సేదదీర్చుకుంటూ, దొరికిన గడ్డీగాదం తిని సాయంత్రానికల్లా తిరిగి ఇళ్ళకి వస్తాయి ఆవుల మందలు. అలా మందలు, మందలుగా ఆవులు ఇంటికి మరలి వచ్చేటప్పుడు, ధూళి నేల మట్టం నుంచి పైకి లేచి, గాలిలో ఎగురుతూ, ప్రకృతికొక వింత సోయగాన్నిస్తుంది. దానినే 'గోధూళి వేళ' అంటారు.

అలాంటి వేసవి రోజుల్లోనే ఓనాడు, మన పాలికాపు మిగతా ఆవులతోబాటు నిండు చూలాలుగా ఉన్న మన ఈ ఆవుని కూడా కొండపైకి మేత కోసం తోలుకుని వెళ్లాడు. రోజంతా కొండ మీద నాలుగు ప్రక్కలా నడవడం వల్లనో ఏమో, సాయంత్రానికి ఈ ఆవు

అక్కడికక్కడే ప్రసవించింది. మామూలుగా అయితే, పుట్టిన బిడ్డని పాలికాపు కుర్రాడు ఎత్తుకుని నడిచి వస్తూంటే, వెనకాలే అంగవేసుకుంటూ నడిచివచ్చేస్తుంది ఆవు. కాని ఆరోజు ఓ పులి మీద పుట్ట జరిగింది.

సాయంత్రమవగానే ఆవులన్నింటినీ అదలకించి క్రొత్తగా పుట్టిన బుజ్జాయి నెత్తుకొని ఇంటికి తిరిగి వద్దామనుకున్న పాలికాపు కుర్రాడికి దగ్గర్లో చిరుతపులి గాండ్రింపు వినిపించింది. ఎక్కడి ఆవుల్ని అక్కడొదిలేసి వాడు పలాయన మంత్రం పఠించాడు. ఆవులన్నీ చెల్లాచెదురై దొరికిన దారినే పరుగులెత్తి ఊరు చేరుకున్నాయి. మన ఆవు మాత్రం పసికందుని పులి బారికి వదలి పారిపోలేక అలాగే నిలబడిపోయింది. పుట్టిన వెంటనే 'అంబా' అని ప్రేమగా పిలుచుకొనే అదృష్టానికి నోచుకోక, 'అంబా' అని ఆర్తనాదం చేయవలసి వచ్చిన తన కన్నారిని చూసి కన్నీరు నింపుకుంది.

సాధారణ పరిస్థితుల్లో, తను అబల కాబట్టి, తన చుట్టూ ఉంటూ, తన వల్ల లబ్ధి పొందుతున్న వారంతా తను కష్టంలో ఉంటే వచ్చి రక్షించి ఉందురు. అది వారి స్వార్థం కావచ్చు. అయినా తనకి రక్షణ చిక్కేది. కాని ఇప్పుడు విపత్కర పరిస్థితి ఎదురైంది. తన కెవరి సహాయం లభించే వ్యవధి లేదు సరికదా తనే అనాథయైన తన బిడ్డని కాపాడు కోవలసిన సమయం ఆసన్నమైంది. కనుక మొండి ధైర్యం తెచ్చుకుంది. ఎంత చిన్నవైనా, ఆత్మరక్షణ కోసం భగవంతుడిచ్చిన రెండు కొమ్ముల్నీ నమ్ముకుంది. ఎదురు పడిన చిరుతపులిని కొమ్ములు చూపించి, అల్లంత దూరంలోనే ఆపు చేసింది. కన్న బిడ్డ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ కొమ్ములతో చిరుతపులిని అడుగు కదలకుండా ఆపు చేసింది.

రొప్పుతూ, రోజుతూ ఊళ్లోకి వచ్చిన పాలికాపు కుర్రాడు జరిగిన ఉదంతం మన యింట్లో చెప్పాడు. పిడుగులాంటి వార్త విన్న మీ నాన్నగారు నిలువునా నీరైపోయారు. అంతలోనే ధైర్యం తెచ్చుకొని, ఊళ్లో ధైర్యవంతులైన ఏభై మంది వరకూ మనుష్యుల్ని పోగుచేశాడు. అంతాకలిసి డప్పులూ, డోళ్లూ వాయించుకుంటూ పెద్ద పెద్ద కాగడాలు వెలిగించుకొని పాలికాపు కుర్రాడ్ని వెంటబెట్టుకుని అడవిలో ఆవున్న స్థలానికి వెళ్లారు. ఈ చప్పుళ్లకి, హడావుడికి, చిరుతపులి ఎప్పుడో తోక ముడిచి చీకట్లో అంతర్థానమైంది. తల్లినీ, బిడ్డనీ క్షేమంగా ఊరేగింపుగా సగం రాత్రి కల్లా ఊళ్లోకి తీసుకొచ్చారు.

అది మొదలు. ఈ ఆవు తన పిల్లల దగ్గరికి ఎవరొచ్చినా నమ్మేది కాదు. వారేదో అపాయం చేసే దురుద్దేశంతోటే, ఆనాటి పులిలా, వస్తున్నారని దాని భయం. తనని కాని, తన సంతానాన్ని కాని, ఎవరు సముదాయించబోయినా, బుస్సు బుస్సు మనడం, కొమ్ములతో పొడవడం ఇలా తయారైంది. ఇప్పుడు చెప్పు అది 'పొడిచే ఆవు'గా మారిందంటే అది దాని తప్పా?!

✷ ✷ ✷

ఈ కథవిన్నాక నా మనసులోని ఒక సమస్యకి సమాధానం అయితే దొరికింది కాని, ఆ కథనం, నాలో క్రొత్త ఆలోచనల్ని రేకెత్తించింది. మా బంధుకోటిలో చిట్టెమ్మగారని ఒక

వితంతువు ఉంది. ఆమెని 'పోట్లాడే చిట్టెమ్మ' గారని అందరూ చెప్పుకుంటారు. ఆమె గురించి నాకు చాలా విషయాలు తెలుసు. మా పొడిచే ఆవు కథ విన్నప్పట్నుంచీ ఈ ఆవు ప్రవర్తనకీ, చిట్టెమ్మగారి పోట్లాడే ప్రవర్తనకీ ఎంతో సామ్యం ఉందని తోచింది నాకు.

చిట్టెమ్మ నోరెట్టుకు పడిపోతుందని అందరూ ఆమెని ఆడిపోసుకుంటారు. ఆమె నోటికి ఝడుసుకోని మా బంధువు లెవరూ లేరు. అలాగని ఆమెతో సంబంధాలు త్రెంచుకున్న వారూ లేరు. తిరిగే కాలూ, తిప్పే నోరూ తిన్నగా ఉండలేవంటారు. మరి చిట్టెమ్మగారిది తిరిగే కాలూ, తిప్పే నోరూ కూడాను. పిలవని పేరంటంగానికైనా సరే, ఆమె ఎవరింటికైనా వెళ్లిందంటే ఇంటెడు చాకిరీ చేసి పెడుతుంది. ఎంతమందికైనా ఇట్టే వంట చేసిపెడుతుంది. ఆమె చేసే వంకాయ పులుసు పచ్చడి ఆమె బద్ధ శత్రువులు కూడా ఆప్యాయంగా భుజిస్తారు. "ఇంతోటిదానికీ, వేరే పనిమనిషి ఎందుకర్రా!" అని అంతమంది తిన్న అంట్లూ ముందేసుకుని మెరిసేలా తోమేస్తుంది. ఆమెకు అభిజాత్యం అంటూ లేదు. ఇక పండగలూ, పబ్బాలూ, శుభకార్యాలు, - అనగూడదుగానీ - అశుభకార్యాలూ, వస్తే చెప్పనే అక్కర్లేదు. ఆమె నోటికి భయపడినా, ఆమె వస్తే చాకిరీకి పదిమంది పెట్టు అవడంతో, ఆమె రావాలనే కోరుకుంటారు అంతా. ఆమె కూడా, "అయినవాళ్లింటికి పిలిపించుకునే వెళ్లాలా ఏమిటి?" అంటూ మొహమాటం లేకుండా వచ్చేస్తూ ఉంటుంది. ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆమె దంతసిరి కూడా అలాంటిదే! చక్కగా నలుగురి భోజనం, సునాయాసంగా కానిచ్చేయ గలదు. "చేసిన ముండ తినకుండా పోతుందా!" అని చూసీచూడనట్టు ఊరుకుంటారు అందరూ. ఆరోగ్యం విషయంలో కూడా ఆమెది మహాభాగ్యమే. ఏనాడూ చిర్రున చీది ఎరుగదు. చక్కని విగ్రహం. అరవయ్యోపడిలో పడినా, ఇరవై కేజీల బియ్యపు అన్నం గుండిగలో పోసి అవలీలగా వార్చేయగలదు.

ఇలా ఇళ్లలో ఊడిగాలు చేస్తూ జీవించడానికి ఆమె ఏమైనా పేదరాలా అంటే? అదేమీ కాదు. ఆమెకు హాయిగా తిని కూర్చోగలిగినంత ఆస్థి ఉంది. డిగ్రీ చేసి ఉద్యోగం చేసుకునే కొడుకున్నాడు. ఇంట్లో కోడలుంది. చచ్చి ఏలోకానున్నాడో, ఆయన వదిలిపెట్టిన డబ్బూ, దస్కం ఉన్నాయి. ఇంతో అంతో భూ వసతీ ఉంది. ఆమెకు లేనిదంటూ ఏమైనా ఉంటే అది నుదుటిన ఎర్రని బొట్టు పెట్టుకునే రాత. దానికి ఆమె ఎంతవరకు బాధ్యురాలు? అంటే ఏమాత్రం కాదనే చెప్పాలి. తనది కాని తప్పుకి తను అనుభవిస్తున్న శిక్ష ఆమె వైధవ్యం. అది ఆమె నెత్తి మీద సంఘం బలవంతాన రుద్దింది. దాని నేపథ్యం నాకు తెలియందికాదు.

చిట్టెమ్మగారు పుట్టింది, నలుగురు అన్నదమ్ములూ, మరో నలుగురు అక్కచెల్లెళ్లూ ఉన్న సమిష్టి కుటుంబంలో. ఆ యిల్లో పెద్ద సత్రంలా ఉండేది. ఎవరొస్తున్నారో, ఎవరు తింటున్నారో లెక్కా పత్రం లేదు. అందరూ అన్నివేళల్లోనూ బిజీగా ఉండేవారు. ఎవరూ ఎవర్నీ ప్రశ్నించేవారు లేరు. తెచ్చిపడేసేవాళ్లొకళ్లూ, వండి పెట్టేసేవాళ్లొకళ్లూ, తినిపోయే వాళ్లొకళ్లు - ఇలా ఉండేది ఆ ఇల్లు రాజావారి కందాలాగ. అలాంటి ఇంట్లో పెద్దాయనకి పెద్ద కూతురిగా పుట్టింది చిట్టెమ్మ. ఆమె అసలు పేరు 'మల్లిక' అయినా ముద్దు పేరు 'చిట్టి' మాత్రమే అందరికీ తెలిసిన పేరు. ఆమె స్కూల్లోనూ, కాలేజీలోనూ చదివేటప్పుడు

'మల్లిక' గా ఉన్న రోజుల్లో నిజంగా మల్లెపూవు లాగే ఉండేది. చలాకీగా ఆడుతూ పాడుతూ ఉండేది. ఆ వయసులోని అందరి పిల్లల్లాగే రేడియోలో క్రికెట్టు కామెంటరీ వినేది. సినిమాల్లో ప్రేమ పాటలు నిజం కావాలని కమ్మని కలలు కనేది. ఆమెకి ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు కూడా ఉన్నారు.

'మల్లిక' ఇంటరులో ఉండగా వాళ్ల దూరపు బంధువొకాయన ఉన్నట్టుండి ముండ మోశాడు. అప్పటికే ఆయనకది ద్వితీయం. ఆయన వయసేమో ఏభై పై చిలుకు. అయితేనేం, బంగారు పిచ్చుక. తరతరాలుగా కూర్చుని తిన్నా తరగని ఆస్థి ఉంది. కాని అది తినడానికి ఆయనకొక వంశాంకురమే లేకుండా పోయింది. అసలందుకోసమే ఆయన ద్వితీయం చేసుకున్నాడు. ఆ కాస్త కోరికా తీరకముందే ఆవిడ గుటుక్కుమంది. కానీ, ఈ ముసలాయనకి మాత్రం వంశోద్ధారకుడిని కనాలనే కోరిక ఏ మాత్రం సన్నగిల్లలేదు. పైగా మరోసారి జాతకం చూపించుకుని, కొడుకే పుడతాడని నిర్ధారణచేసుకుని పునర్వివాహానికి ప్రయత్నాలు మొదలు పెట్టాడు. వారి 'ప్రియదర్శినీ పేటిక'లో మల్లిక రూపం కనిపించడం కేవలం యాదృచ్ఛికం కాదు.

ఆయన పంపిన రాయబారానికి చిట్టి తలిదండ్రులు ఎగిరి గంతేశారు. బంగారం లాంటి అవకాశం. అంతటి ఆస్థిపరుడు తనంతట తాను 'దేహీ' అని అడుగుతున్నాడు. మొగాడికి ఏభై ఏళ్ళు ఓ వయసు కాదు. ఈ పెళ్లిగానీ జరిగితే మొత్తం కుటుంబానికి ఓ ఆధారం ఏర్పడుతుంది. ఇంతమంది ఉండే సమిష్ఠి కుటుంబంలో ఉన్నారో లేరో తెలియకుండా బతికే బతుకూ ఓ బతుకేనా! దీన్ని నెమ్మదిగా ఆ యింట్లో పడేస్తే, కొడుక్కి మంచి చదువు చెప్పించుకోవచ్చు. మిగిలిన ఇద్దరు కూతుళ్లకీ మంచి సంబంధాలు చేయొచ్చు. ఇలా ఆలోచిస్తూపోతే చిట్టి తలిదండ్రులకి భవిష్యత్తు అంతా బంగారుమయంగానే కనిపించింది. కానీ ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డ భవిష్యత్తుని మాత్రం బుగ్గిలో పోస్తున్నామన్న ఆలోచన రాలేదు వారికి. ఈ విషయంలో చిట్టిని అడగాలని కాని, దాని అంగీకారం తీసుకోవాలని కాని వారికి తోచలేదు. అది చిన్నది. దాని మంచిచెడ్డలు దానికేం తెలుసు? అయినా మేం దాని శత్రువులం కాము కదా! అని సరిపెట్టుకున్నారు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ లోకమంతా చీకటే అనుకుంటుందిట. అలాగే చిట్టి తండ్రి కూడా కళ్లు మూసుకుని కాఫీ తాగుతూ పెళ్లికి అంగీకరించేశాడు. లోకానిదేముంది! ఇవాళ అరుస్తుంది. రేపు మరచిపోతుంది. మన మంచి చెడ్డలు చూసుకోవలసింది మనం - అని లోలోపల సంతోషించింటి చిట్టి తల్లి.

ఇవేమీ తెలియని చంటి పాపేం కాదు చిట్టి. ఇంటరు బుర్రతో తనూ చాలా ఆలోచించింది. కాదని గోల చేసి ఈ పెళ్లి ఆపేయడం ఏమంత ఘనకార్యం కాదు. ఇంకా దూరం పోతే ఓ తాడో, నుయ్యో దొరక్కపోవు. కానీ అలా చేస్తే తన జీవితం తనకి దక్కదు. అటు తలిదండ్రుల కోరికలూ తీరవు. ఇది ఇరువైపులా నష్టపోయే బేరం. నోరు మూసుకుని ఊరుకుంటే వ్రతం చెడ్డా ఫలం దక్కుతుంది. దీపంలో వత్తి కాలిపోయినా అది ప్రసాదించిన

వెలుతురులో కొందరు ఇల్లు చక్కబెట్టుకుంటారు. అందుకే ముభావంగా ఊరుకుంది చిట్టి.

ఎవరో ఛాందసులు మూడో పెళ్ళి ముక్కలవుతుందన్నారని అలాంటి పరాభవం జరగకుండా ఉండడానికి, ఆ దూరపు బంధువు ముందుగా అరటి చెట్టుకి తాళి గట్టి, దాన్ని నరికి పారేయించి ( ఆ విధంగా మూడో పెళ్ళాన్ని ముక్కలు చేసి) నాలుగో భార్యగా చిట్టిని కట్టుకున్నాడు.

ఏడాది తిరిగేసరికి ముసలాయన జాతకాలు నిజమౌతాయని నిరూపించడానికే అన్నట్టు వంశోద్ధారకుడిని కన్నాడు. విజయగర్వంతో సంవత్సరం గడిపి, ఆస్థినంతా భార్యకీ, కొడుక్కీ అప్పజెప్పి హరీమన్నాడు. చిట్టి తల్లిదండ్రులు, తమ్ముడూ, ఇద్దరు చెల్లెళ్ళూ, పాపం అనాధకి సహాయంగా ఉండాలికదా అని ఈ యింటికి మకాం మార్చేశారు. ఆ తరువాతి కాలంలో తెలిసి వచ్చింది చిట్టికి - అయిన వాళ్లే ఆజన్మ శత్రువులుగా ఎలా మారిపోతారో!

కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయి. అలాంటిది అస్థిరాలైన ఈ ఆస్థిపాస్తులెంత? అందులోనూ ఒకళ్లా, ఇద్దరా? తనూ, కొడుకూ కాక తల్లీ, తండ్రీ, తమ్ముడూ, ఇద్దరు చెల్లెళ్లూ ఎలకల్లా దొలిచేస్తుంటే, కొండ తరగసాగింది. పైసా సంపాదన లేకుండా అందరూ తినడం, పడుకోవడం, సోమరితనంగా ఊరంతా బలాదూరు తిరగడం. రానురాను, విలాసాలకీ, వినోదాలకీ, సినిమాలకీ, షికార్లకీ ఖర్చులు ఎక్కువ కాసాగాయి. అదేమని అడ్డుకునేవాళ్లు లేకపోవడంతో, అంత వయసొచ్చిన తల్లితండ్రీ కూడా ఇంటిలోకి ఓ కాసు వచ్చే విధానం ఏమిటని ఆలోచించలేదు. పైగా మాకు లోటేమిటని, అడిగినంత కట్నం ఇచ్చి ఇద్దరాడపిల్లలకి పెద్దిళ్లలో పెళ్లిళ్లు చేశారు. వాళ్ల రాకపోకలకీ, పురిటి పుణ్యాలకీ విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టేశారు. తన --ము- కాకపోతే ఏలేశ్వరం దాకా దేకుతానన్నాడట ఎవడో! అలా తయారైంది వారి వ్యవహారం.

చూస్తూ, చూస్తూండగానే ఎకరాలకి రెక్కలు వచ్చి ఎగిరిపోసాగాయి. ఎవరికీ పిసరంత నొప్పి కూడా కలగడం లేదు. రాబడి బాగా తగ్గిపోయి ఇంట్లో ఉప్పుకీ, పప్పుకీ తడుముకోవలసి వస్తోంది. ఒకటీ, రెండూ బంగారు గొలుసులు ముచ్చటపడి అమ్మ మెడలో వేస్తే, అవి తాకట్టు పెట్టి పేకాట ఆడేశాడు తండ్రి.

పరిస్థితి విషమిస్తోందని పసిగట్టిన చిట్టి మనసులో చింత చోటు చేసుకుంది. తను చేసిన త్యాగానికి ఫలితం ఇదేనని సమాధానపడలేకపోయింది. "తమ్ముడి చేత ఏదైనా ఉద్యోగం చేయిస్తే బాగుంటుందేమో నాన్నా" అంది కొంతైనా బాధ్యత తెలుసుకుంటా రేమోనని. "వాడికి ఒకడి కింద నౌఖరీ చేసే ఖర్మ ఏమిటే? నా కొడుకు రాజా! వాడు వ్యాపారం చేస్తాడు" అని అడ్డుపుల్ల వేసింది తల్లి. దానికి పెట్టుబడి ఎలా వస్తుందన్నది ఆమె కనవసరం. పైగా తాడూ, బొంగరం లేకుండా జులాయిగా తిరుగుతున్నవాడికి, కట్నం పుచ్చుకుని పెళ్ళి కూడా చేశారు. ఆ కోడలూ ఈ మందలో కలిసింది.

ఇదంతా చాలక, ఇంటి ఖర్చులు పెరిగాయి కాబట్టి, నీ ఖర్చులు తగ్గించుకోమనీ, కొడుకుని కాన్వెంటు చదువులు మాన్పించమనీ చిట్టిని పోరడం మొదలుపెట్టింది తల్లి. ఓ విధంగా, ఆ యింట్లో తనూ, కొడుకూ మాత్రమే పరాయి వాళ్లు అయినట్టుగా అందరూ ప్రవర్తించసాగారు.

ఇలా మొట్టికాయలు తింటూ, తనెంత ఊబిలో కూరుకుపోయిందో తెలుసుకునేసరికి చిట్టి కాస్తా 'చిట్టెమ్మ'గారుగా మారిపోయింది. ఇక ఆలస్యం చేస్తే మొదటికే మోసం వచ్చేలా ఉందన్న సత్యాన్ని గుర్తించింది. ఆయన సంపాదించుకుని, తన ద్వారా వంశోద్ధారకుడిని కని, వాడికాస్థి అప్పజెప్పి పోవాలని కలలు గన్న తన భర్త ఆశయం నెరవేరడం వీటన్నింటికంటే ముఖ్యం అన్న నిజాన్ని తెలుసుకుంది. ఈ వ్యవహారం ఇలాగే నడిస్తే, తనకీ, కొడుక్కీ త్వరలోనే చిప్ప చేతికి రాగలదని కూడా ఊహించగలిగింది. అలా జరిగితే తనదే ఆ అపరాధం కనుక దానికో పరిష్కార మార్గం ఆలోచించి వెంటనే దానిని అమలు చేయసాగింది.

ఇంట్లో రాబడి, ఖర్చు అంతా తనంతట తాను చూసుకుంటూ, మిగతా అందర్నీ దూరంగా ఉంచసాగింది. మొదట్లో వాళ్లు కుయ్యో, మొర్రో మన్నా, ఇష్టం లేకపోతే ఇంట్లోంచి పొమ్మంది. వాళ్ల నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డంతో నెమ్మదిగా తమ దారి తాము చూసుకో సాగారు. "ఇదేమన్యాయం! అయిన వాళ్లని వెళ్లగొడతావా?" అని ఊళ్లో వాళ్లెవరైనా అడగవస్తే, "నా ఇల్లు గుల్లైనప్పుడు మీరంతా ఏమయ్యా"రని తిట్టిపోసింది. ఇలా నోరెట్టుకు పడిపోయి, కరవ వచ్చిన వాళ్లని తనే కరవసాగింది. దాంతో తన ఇంటికి పట్టిన చీడ వదిలించుకోవడమే కాక, కొడుకుని డిగ్రీ చదివించుకుంది. ఓ ఇంటి వాడిని చేసింది. చచ్చి స్వర్గానున్న ముసలి మొగుడి ఫోటోకి దండ వేసి నమస్కారం చేసింది. కాని ఆవిడ అలవాటు చేసుకున్న నోటి దురుసుతనం మాత్రం బాగా రక్షణ కల్పించడంతో, వదులుకోలేకపోయింది.

కొమ్ములతో ఆవు పులి నెదిరించి నిలబెట్టిందంటే నమ్మలేని వీరులెవరైనా, నోటి దురుసుతనంతోనే చిట్టెమ్మగారు సంఘాన్నెదిరించి నిలిచిందంటే నమ్మలేకపోదురు గాక! నమ్మినా నమ్మకపోయినా నిజం నిజమే కదా!

ఇప్పుడు చెప్పండి ఆమె "పోట్లాడే చిట్టెమ్మ"గా తయారయిందంటే అది ఆమె తప్పా?!

✷